# లక్ష్యభ్రమణం

మార్బ్యక్వ్ దగ్గరున్న యాపిల్ ఉడ్ గార్డెన్‌కి స్ట్రాబెరీ పికప్‌కి వెళ్ళింది నీల. ఒక వైపు ఎండకు చెమట పోస్తోంది. అయినా గార్డెన్‌లో ఒక్కొక్క చెట్టు దగ్గరా వంగి... ఎర్రగా ముదర పండిన స్ట్రాబెరీస్ ఒక్కొక్కటీ కోస్తూ... ఆ కోసిన వాటిని ఒకటి తన దగ్గరున్న ఫ్రూట్ బాస్కెట్ లోకీ... మరోటి నోట్లోకీ



— కె. సరోజ

పడేస్తోంది. అలా ఫలాలు భక్షిస్తున్న ఆమె పెదవులు కూడా స్ట్రాబెరీస్ రంగులో... ఎర్రగా... 'లిప్‌స్టిక్' కంటే అందంగా వున్నాయి. మిగిలినవాళ్ళందరూ కూడా అలా తింటూవుండటం నీలకు ముచ్చట గొల్పింది.

టొరంటోలో వేసవి కాలంలో స్ట్రాబెరీస్ విరివిగా పండుతాయి. సరదా వున్న వాళ్ళందరూ తోటలకు వెళ్ళి... తిన్నన్ని తిని... మిగిలినవాటితో బుట్టలు నింపుకుని... తూకం వేయించి... డబ్బు చెల్లించి ఆనందంగా ఆ పళ్ళ బుట్టలతో కార్లెక్కడం పరిపాటే...

స్ట్రాబెరీస్ చెట్లు మామిడి చెట్లలా వుంటాయని ఊహించిన నీల ఆ చెట్లు నేలబారుగా ఉండటం చూసి... కొంచం నిరుత్సాహపడింది. కానీ... పెద్ద ఉసిరికాయల సైజులో... కళ్ళు చెదిరిపోయే ఎర్రని రంగుతో... చెట్ల నిండుగా వున్న పళ్ళు చూసి... ఆమెకు సంతోషం కల్గింది. ఉత్సాహం ఉరకలు వేసిం దామెలో. ఎప్పుడూ పండ్లు కొనుక్కుని తినడమే కానీ... ఇలా చెట్ల నుంచి డైరెక్ట్‌గా కోసుకుని తినడంలో వున్న ఆనందం ఆమె కంతగా తెలియదు. ఆ పండ్ల రుచి అమోఘంగా వుంది. కొద్దిగా జామ పండ్ల రుచి కూడా వచ్చింది.

చిన్నప్పుడు జామ పళ్ళు... సపోటాలు, సీమ చింతకాయలు కోసుకుని తిన్నా ఇలాంటి అనుభూతి ఎప్పుడూ కల్గినట్లు లేదు. బహుశా! యిది పెద్ద తోట కావటం వల్ల కాబోలు! అనుకుంటూ కడుపు నిండా స్ట్రాబెరీలు తిని... నాలుగు బుట్టల నిండా తీసుకుని... పది డాలర్లు చెల్లించి... హుషారుగా ఆ బాస్కెట్స్ తీసుకుని కార్లోకొచ్చి... స్టీరింగ్ ముందు కూర్చుని, సీటు బెల్ట్ వేసుకుని కారు స్టార్ట్ చేసింది.

ఆమె ఇంటికి వచ్చేటప్పటికి సమయం మధ్యాహ్నం రెండున్నరైంది. ఇల్లు చూసేటప్పటికి నీరసం ముంచు కొచ్చింది. ఇంట్లోకి రాగానే... ఉస్సురంటూ... రెండు గ్లాసుల మంచినీళ్ళు పట్టించి...

"స్ట్రాబెరీ పికప్ మహా సరదాగా వుంది. ఈవేళ నా భోజనం స్ట్రాబెరీలతోనే అయింది. యింక ఆకలిగా లేదు. నువ్వు 'లంచ్' చేసెయ్యి. నేను రెస్టు తీసుకుంటాను" అంటూ భర్త సమాధానం కోసం ఎదురు చూడకుండానే మంచమెక్కింది.

"హు! నీకు కడుపు నిండని దెప్పుడూ!

నేనో పిచ్చి వెధవని కాకపోతే నీ కోసం ఎదురు చూస్తూ మాడటం ఏమిటీ! తను వచ్చేటప్పటికి పిజ్జా చేసి వుంచమంది కదా! అని చేశాడు. స్ట్రాబెరీస్ పికింగ్ అంటే తనకు విసుగు. యాపిల్స్ లాంటివైతే సరదానే. అందుకు ఆమెను వెళ్ళమన్నాడు. రాగానే 'లంచ్' చేయాలనీ, ఈ మొగుడుగాడు తన కోసం కనిపెట్టుక్కూర్చుంటాడనీ... ఆలోచించే ఓపికా, తీరికా నీల కెక్కడివి!



ఆమెకో రోజు బర్గర్ కింగ్‌తో కడుపు నిండుతుంది.

మరొక రోజు హాట్ డాగ్స్‌తో

ఇంకొక రోజు లజానియాతో... మరింకో రోజు సబ్ మెరినో. వెజిటేరియన్ ఫుడ్ కావలసినవాడు తనేగా! అందుకే అప్పుడప్పుడూ తనకు వచ్చిన పద్ధతిలో వుండటం అలవాటు చేసుకున్నాడు.

ఇప్పుడు తనకు ఆకలి కరకర్లాడుతోంది.

"ప్రాశెరీస్ తిన్నమ్మ మొగుడా కలెరుగదు!" విరక్తిగా నవ్వుకుని అవెన్‌లో నుంచి పిజ్జా తెచ్చుకుని కొంచం కొంచం తినసాగాడు జయంత్.

నీల తినకుండా తను తినడం!

అర్థాంగి అంటే మరి తన శరీరంలో సగ భాగం కదా!

లేకపోతే పెళ్ళి మంత్రాలకూ, ఆ తంతుకూ అర్థం లేదు.

సహజీవనానికి అంతకంటే అర్థంలేదు.

అలా ఆలోచించగానే... ఏమిటోగా అనిపించి, ఆ పిజ్జా తీసుకు వెళ్ళి గార్బేజ్‌లో పడేసి... చేతులు కడుక్కుని, మంచినీళ్ళు తాగి

టొరంటో స్టార్ న్యూస్ పేపర్ చూడటం ప్రారంభించాడు.

కొంతసేపయ్యాక ఆడుకోవడానికి వెళ్ళిన పదేళ్ళ కూతురు దీప, ఐదేళ్ళ కొడుకు శ్యామూ, "డాడీ! ఆకలి" అంటూ వచ్చారు. వాళ్ళకు 'లంచ్' యిచ్చి, తిరిగి టొరంటో స్టార్‌తో లీనమయ్యాడు జయంత్.

నీల అయితే పిల్లలు ఆకలి అన్నప్పుడల్లా విసుక్కుంటుంది."ప్రొద్దున సీరియల్ తిన్నారుగా! మళ్ళీ ఆకలా' అంటుంది. పన్నెండింటికి ఇంకేదో మింగారుగా! మళ్ళీ ఏమిటది? అయినా వీక్ ఎండ్ వస్తే మరో పనే లేదు తినటం తప్ప!

అసలు తిట్టాల్సింది మీ డాడీని, మిమ్మల్ని కాదు" అంటుంది. అందుకే... తల్లి నిద్రపోతుంటే సంతోషించారు ఆ పసివాళ్ళు.

సాయంత్రం ఆరు గంటలకు నిద్రలేచిన నీల... ముఖం కడుక్కోకుండానే... మేకప్ వేసుకుని... పెర్ఫ్యూమ్స్ రాసుకుని...

"వాక్‌కి వెళ్తున్నా! నువ్వూ వస్తావా?" అన్నది భర్తతో. అతడు జవాబు చెప్పేలోగా తిరిగి తనే...... "నీ అవతారం చూస్తుంటే నువ్వు రెడీ అవడానికో గంట పట్టేలా వుంది... నేను వెళ్తున్నా" అంటూ అందమైన జెర్లీ షూప్ టక టక లాడేలా నడుస్తూ వెళ్ళింది.

అయిదారు నెలలుగా ఇలాంటివన్నీ జయంత్‌కూ, పిల్లలకూ బాగానే అలవాటవడంతో వాళ్ళకేం కొత్తగా అనిపించలేదు.

జయంత్ మనసు మూసుకుని బాధతో మూలిగింది. వాక్‌కి వెళ్ళటం అంత అర్జెంటా! ఒక్క అయిదు నిమిషాలాగితే... తనూ, పిల్లలూ నీలతో వెళ్ళకపోయే వాళ్ళా!

పోనీ ఒక్క అయిదునిమిషాలుముందు చెప్పవచ్చుగా!

ఓ అరగంట తర్వాత పిల్లల్ని తీసుకుని పార్క్‌కి వెళ్ళాడు జయంత్.

నీలకు ముప్ఫై ఐదేళ్ళు. జయంత్ కూడా సరిగ్గా ఆమె ఈడు వాడే. వాళ్ళు కెనడా వచ్చి అయిదేళ్ళైంది. వచ్చిన తర్వాత అయిదారు నెల్లపాటు నానా అవస్థపడి... ఇద్దరూ ఉద్యోగాలు తెచ్చుకున్నారు.

జయంత్ ఫుడ్ ఫ్యాక్టరీలో సూపర్ వైజరు. నీల మేకప్ అండ్ పెర్ఫ్యూమ్స్ ఫ్యాక్టరీలో టెలిఫోన్ ఆపరేటరు.

* * *

"నీలా! ఏమిటే కంపు! నేను భరించలేను.

కడుపులో వికారపెడ్తోంది. చిన్నప్పట్నుంచీ కూడా నాకిలాంటివి పడవు."

వాంతి చేసుకున్నంత పనీ అయి, ముక్కు మూసుకుంటూ బాధగా అన్నాడు జయంత్.

"ఇప్పుడేం కొంప మునిగిందని! అంత ఇష్టం లేకపోతే అవతలికెళ్ళి పడుకోవచ్చుగా!"

"అంతే నంటావా?"

"ఆ... అంతగాక మరెంత? అసలైనా ఇందులో తప్పేమిటీ? మగవాళ్ళెంతో మంది సిగరెట్లు తాగడం లేదా! అలాగే ఆడవాళ్ళూనూ. ఈ దేశంలో ఆడా-మగా భేదం లేదు. ది సీజ్ ఏ ఫ్రీ సొసైటీ.

> మనం బాధలో ఇంకొకరికి ఆనందాన్ని కల్గించామనే జ్ఞానం కన్నా, గొప్ప ఆనందం వేరొకటి లేదు.
>
> —చలం

ఇఫ్ యూ వాంట్ యూ కెన్ స్మోక్ టూ"

"ఛీ! నీ బుర్ర పూర్తిగా కుళ్ళిపోయింది. నువ్వు బయటికి వెళ్ళి నేర్చుకొచ్చింది ఇదా!"

"ఇదేం ఇండియా అనుకున్నావా? అక్కడున్న న్నాళ్ళూ అత్తగారూ, ఆడపడుచులూ, ఇరుగింటమ్మా! పొరుగింటమ్మా అందరికీ అందరి విషయాలూ కావాలి, వాళ్ళ సంసారాలు చక్కపెట్టుకోలేరు గానీ... ఇతరుల సంసారాల్లో కలతలు రేపడం చాలా మామూలు మన వాళ్ళకి.

చిన్నప్పుడు అమ్మా నాన్నా నన్ను ఫ్రీగా వుండనివ్వ లేదు.

పెళ్ళైం తర్వాత కొంతకాలం నువ్వు మటుకూ... ఎలా వున్నావేమిటీ? నన్ను స్వేచ్ఛగా వుండనిచ్చావా?"

"నేను ఎప్పుడూ నిన్ను బాధపెట్టలేదు"

నెమ్మదిగా అన్నాడు జయంత్.

"బాధ పెట్టావని నేనన్నానా? చిన్నప్పటి నుంచీ నాకు వెస్ట్రనైజ్‌డ్‌గా వుండటం ఇష్టం."

"అందుకని ఈ విపరీతమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ఎలా వినియోగించుకోవాలో దిక్కు తోచక ఈ పద్ధతి అవలంబించి పతనమవుతున్నావన్న మాట!

నువ్వు దిగజారిపోతున్నావ్ నీలా! నిన్ను నువ్వు దిగజార్చుకుంటున్నావ్"

నవ్వింది నీల.

"ఈ పద్ధతి సరైంది కాదు, సంసారం విచ్చినమై పోతుంది.

నా మాట విను నీలా!

"ఇక్కడి వాళ్ళలో, ఎన్ని మంచి క్వాలిటీస్ వున్నాయి. ఉదాహరణకి స్ట్రైట్‌గా మాట్లాడటం, కలిసి కట్టుగా వుండటం మొదలైనవి. వీళ్ళల్లో చాలా మంది 'సింగిల్స్'గా మిగిలిపోతుంటారు.

మరి కొందరేమో భర్త ఎక్కడ వదిలేస్తాడో! తమ అందం ఎక్కడ తరిగిపోయిందో! అని అహర్నిశలూ అందం కోసం శ్రమ పడ్తుంటారు.

"తనలో ఏ లోపం వస్తే భార్య తనని వదిలేస్తుందో! అని భర్త అప్రమత్తుడై వుంటాడు. అయినా జరిగేవి జరుగుతూనే వుంటాయనుకో! అది వేరే విషయం."

మనవాళ్ళ కిలాంటి బాధ లేదు. అవన్నీ అలా వుంచి మంచి గుణాలు వదిలి నువ్వు ఈ సిగరెట్లు తాగడం..."

"ఆక్షేపణీయం అంటావ్"

అవునన్నట్లు నీల వైపు చూశాడు జయంత్.

"చూడు! మై డియర్ ఇన్నోసెంట్ హబ్బీ! సిగరెట్లు తాగడమేం ఖర్మ రేపట్నుంచీ వైన్ కూడా ఇంటికి తెచ్చుకుని తాగుతాను."

తమాషాగా కళ్ళెగరేసింది నీల. అనటమే కాదు అక్షరాలా ఆచరించి చూపింది మర్నాటి నుంచీ.

వాళ్ళ ఇంట్లో వున్న జంబో సైజ్ ఫ్రిజ్ నిండా డ్రింక్స్ అమర్చింది.

ఒక్కొక్క గదిలో... ఫ్లష్ వాష్ రూమ్‌లోనూ యాష్ ట్రేలు తనకు వీలుగా అమర్చుకుంది. ఆ ఏర్పాట్లన్నీ చక చకా చేసింది.

జయంత్ చాలా సౌమ్య స్వభావి, ఉత్తముడూ; భార్యనీ తిట్టటం, కొట్టటం లాంటివి అతని డిక్షనరీలోనే వుండకూడదు. అందుకే నీలకు 'నీతి బోధ' చెయ్యడం తన విధిగా భావించాడు.

"నీలా!"

"ఊ... ..."

"ఇది ఈ పూట నాలుగో బాటిలూ, ఆరో సిగరెట్టు... ఇలా అయితే ఆరోగ్యం దెబ్బతింటుంది. అదీ గాక పిల్లలు కూడా నేర్చుకుంటారు నీలా!"

ఆమె రెండు చేతులూ పట్టుకుని బ్రతిమాలాడు.

జయంత్ అతని చేతులు విసురుగా తీసేసి... మరో పెగ్ పట్టించడాని కుపక్రమించింది. అయినా సహనం కోల్పోలేదతను.

"చూడు నీలా! ఆడవాళ్ళు చిన్నప్పుడు తండ్రి రక్షణలోనూ, వయస్సులో భర్త రక్షణలోనూ, వృద్ధాప్యంలో కొడుకు రక్షణలోనూ ఉండాలన్నారు. పండితులు బహుశా ఇలాంటి అనర్థాలు రాకుండా వుండేందుకేనేమో!"

"అహ్హహ్హ ... ..." వికటాట్టహాసం చేసింది నీల.

"ఏమిటా నవ్వు!"

"మరి ఏడవ మంటావా! నీ మాటలకు!! నేనిప్పుడు నీ రక్షణలో లేక బాయ్ ఫ్రెండ్‌తో పారిపోయానా?"

'అది కూడా అవుతుందేమో, లోగుట్టు పెరుమాళ్ల కెరుక!' అనుకున్నాడు జయంత్ "వాడెవడో పండితుడో, పండిత పుత్రుడో! పని పాటా లేకుండా వర్ణించాడు. పనికి మాలిన నీతులన్నీను. అదీగాక అవి వ్రాసి కొన్ని వేల సంవత్సరాలైంది. ఇప్పుడు కాలం మారింది. మనుషులూ - మనస్తత్వాలు మారాయి. ఆడకో రూలూ మగకో రూలూ అనే రోజులూ పోయాయి.

"ఇది ఇరవయ్యవ శతాబ్దం తెలుసా! అసలైనా ఆ సోదంతా యిప్పుడెందుగ్గానీ ... ... ఆ అగ్గి పెట్టె తీసుకొచ్చి సిగరెట్ వెలిగించు" అంటూ సిగరెట్ నోట్లో పెట్టుకుంది.

"మరీ ఏమిటింతకి తెగిస్తున్నావ్!"

"మాడు మైడియర్! ఇండియాలో నీ ఫ్రెండు మహేష్ సిగరెట్లు నోట్లో పెట్టుకుని... భార్యని వెలిగించమనేవాడు. ఆమె వచ్చినట్లు వెలిగించేది. తప్పతాగి వచ్చి ఆమెను చావ చితక్కొట్టేవాడు. ఇవన్నీ నీకు తెలియని విషయాలా! నేనింకా నయం నిన్ను తన్నడం లేదు.

మరి మగవాడికి లేని తప్పు ఆడదానికెక్కడ్నించి వచ్చిందీ!

మా ఫ్యాక్టరీలోనే నయం. మగవాళ్ళెంతో మంది నా సిగరెట్ కూడా వెలిగిస్తారు."

"సిగరెట్టేం ఖర్మ! ఏదైనా వెలిగిస్తారు. వాళ్ళకేం! నువ్వు అమ్మ వెనక పుట్టావివా? నాన్న వెనక పుట్టావివా? చివరికి నష్టపోయేది నువ్వు! పతనమయ్యేది నువ్వు. ఈ వెలుగులన్నీ కలిసి ఓ అగ్ని గుండమై నిన్ను నిలువునా దహించేస్తాయి."

"ఓహ్! పూర్ గై. యూ డోన్ట్ నో హౌటూ ఎంజాయ్ లైఫ్.

డోన్ట్ యూ నో మై ఏంబిషన్స్..."

"నీలా! నేనూ తాగి తందనాలాడి క్లబ్బుల వెంబడి పూటకో అమ్మాయితో గడిపే రకమైతే నువ్విట్లా మాట్లాడినా అందం చందం"

"అదే నేనూ అంటున్నాను.

అక్కడ మహేష్ భార్య తాగదు. యిక్కడ నీల భర్త తాగడు. ఆమె వుండే సొసైటీ ఆడవాళ్ళు తాగకూడదని ఆంక్షలు విధించే పక్షపాతపు సొసైటీ.

కానీ ... ... ఇదీ ఫ్రీ సొసైటీ!

ఫ్రీ... ... ఫ్రీ... ..." ఆ 'ఫ్రీ' అనే పదం నొక్కి పలికింది నీల. "అసలైనా నీకిక్కడి ఆనందం గురించి బొత్తిగా తెలియదు జయంత్. నీలాంటివాళ్ళు బతకడం కష్టం ప్చ్..."

"అయ్యో రాత! నీకెట్లా చెప్పేది నీలా!"

తల బాదుకున్నాడు జయంత్.

విలాసంగా సిగరెట్ పొగ రింగులు రింగులుగా వదుల్తూ "నిన్నూ, మన భారత దేశాన్ని ఎవ్వరూ బాగు చేయలేరు" అంటూ నవ్వింది నీల.

మొహం పక్కకి తిప్పుకున్నాడు జయంత్.

* * *

"నీలా! బాయ్ ఫ్రెండ్‌ని కూడా వెంటేసుకొచ్చావా?" ఎంత సున్నితంగా చెప్పినా విపరీతమైన ఆవేదన తొంగిచూస్తూనే వుందతని స్వరంలో.

"వాటీజ్ రాంగ్! ఐ యామ్ ఎ యంగ్ ఎనర్జిటిక్ అండ్ బ్యూటిఫుల్ గరల్. ఐ విష్ టూ మూవ్ ఎరౌండ్ విత్ బాయ్ ఫ్రెండ్స్. నా ఇష్టమది. కావాలంటే నువ్వూ వెదుక్కో గర్ల్ ఫ్రెండ్స్‌ని"

"అవును! నేను కూడా అట్లా చేస్తే సంసారం బాగుంటుంది దివ్యంగా" విరక్తిగా నవ్వాడు జయంత్.

"ఓ గాడ్... ... ఐ కాంట్ హెల్పిట్. వుయ్ ఆర్ గోయింగ్ నౌ"

అయ్యో! నీలా! మనం కెనడా వచ్చినందుకు ఫలితమా ఇది! నా చెయ్యి దాటిపోయావ్ నువ్వు.

ఇంక నీకు చెప్పటం శుద్ధ దండగ.

నా శ్రమ అంతా బూడిదలో పోసిన పన్నీరైంది కదా! రోగాలము దాపురించినవారు హితుల మాటనూ, దీప నిర్వాణ గంధమునూ కనరూ, వినరూ, మూర్కొనరూ అన్నాడు మహానుభావుడు చిన్నయసూరి.

> ఉన్నతంగా ఆలోచించేవారి కెన్నడూ ఒంటరితనం ఉండదు. వారి ఆలోచనలే వారికి నేస్తాలు, మిత్రులు.
>
> —సి.సిడ్నీ

అది నిజం.

ఈ మాటలన్నీ జయంత్ పెదవులు దాటి బయటికి రాలేదు.

అలా మరి కొంత కాలం గడిచింది.

నీల కొందరు తెల్లవారి స్నేహ ప్రభావంతో మరీ నిప్పుల నిడిగా తయారైంది.

రోజుకో బాయ్ ఫ్రెండ్‌తో తిరగ సాగింది. వెరైటీ వెరైటీ అంటోంది.

"నీకు నేను నచ్చకపోతే ఎవరో ఒకర్ని ఎన్నుకుని జీవితం సుఖమయం చేసుకో నీలా! అంతే కాని... ఇట్లా రోజుకొకడితో గడపటం నేను సహించలేకపోతున్నాను." అంటూ ఆమెకు మరోసారి హితోపదేశం చేశాడు గాని...

అది చెవిటివాడి ముందు శంఖం ఊదిన చందమే అయింది.

జయంత్‌లో సహనం మచ్చుకి కూడా మిగల్లేదు.

పగలూ రాత్రి తీవ్రంగా ఆలోచించి ఒక నిర్ణయాని కొచ్చాడు. తను ఇద్దరి సంపాదనతో కొన్న డెబ్బై వేల డాలర్ల ఖరీదైన ఇంటిని నీల పేర వ్రాశాడు.

చట్టరీత్యా ఇద్దరూ విడిపోయారు.

పిల్లలు తండ్రి రక్షణలోనే మిగిలారు.

తల్లికి దూరమైన బాధ రవ్వంత కూడా వాళ్ళలో లేదు.

వారం రోజుల్లోనే జయంత్ రూపం పూర్తిగా మారిపోయింది. పెరిగిన గడ్డమూ - మాసిన బట్టలూ, పూచిక పుల్లలా అయిపోయిన శరీరమూ అన్నీ కలిపి అతనికి పిచ్చివాలకాన్ని తెచ్చిపెట్టాయి.

పదిహేను రోజులు ఒక స్నేహితుడింట్లో గడిపి... 'ఇక్కడ నాకేం మిగిలింది చివరకు?' అని తనను తాను ప్రశ్నించుకుని

కోటాను కోట్ల ముక్కలైన మనస్సుతో - పుట్టెడు దుఃఖాన్ని మూటగట్టుకుని పిల్లలతో సహా మాతృదేశానికి తరలి వెళ్ళాడు జయంత్.

నీల గురించి ప్రశ్నించిన వారందరికీ ఒకే జవాబు.

"నీలకున్న కంపెనీ మనకు సరిపడేది కాదు.

వీక్ మైండెడ్ పీపుల్ మీద కొన్ని విషయాలు చాలా త్వరగా ఇన్‌ఫ్లుయెన్స్ అవుతాయి.

ఎండమావులను చూసి మంచినీరని భ్రమపడింది. ఆ భ్రమతోనే తన జీవితాన్ని మరో మలుపు మళ్ళించింది. ఆమెకు నచ్చిన కెనడియన్స్‌తో వుంటోంది. యింతకు మించి నన్నేం అడక్కండి" అంటూ అక్కడ్నించి వెళ్ళిపోతాడు.

* * *

కాల గర్భంలో రెండేళ్ళు గిర్రున తిరిగిపోయాయి.

జయంత్‌కి మంచి ఉద్యోగం వచ్చింది. పిల్లలిద్దరూ చక్కగా చదువుకుంటున్నారు.

గతాన్ని పీడకలగా భావించి... భవిష్యత్‌ని తీర్చి దిద్దుకునే ప్రయత్నంలో వున్నాడతను.

ఈమధ్యనే ... ..."తగిన వధువు కావలెను" అని పేపర్లో ప్రకటన కూడా వేసుకున్నాడు.

నీలకు స్మోకింగ్, డ్రింకింగ్ అతి కావటం వల్ల థ్రోట్ క్యాన్సర్ వచ్చింది.

ఆమె జీవిత కాలం మరొక్క 'మూడు నెలలు' మాత్రమేనని డాక్టర్ ఖచ్చితంగా చెప్పేశాడు.

ఆమె దగ్గర డబ్బు ఎక్కువ లేదు.

ఇల్లు అమ్మేసింది.

ఆమెకు లేచి తిరగటం కూడా అసాధ్యమైపోయింది.

ఆమెను 'అందాల రాశి' అని పొగడి ఆమె అందాన్ని, వయసునూ తనివితీరా అనుభవించిన బాయ్‌ఫ్రెండ్స్‌లో ఒక్కడు కూడా ఆమె స్థితి తెలిసినా ఆమెను చూడలేదు సరికదా సానుభూతి కూడా చూపలేదు. అప్పుడు నీలకు జ్ఞానోదయమైంది.

కనుపించని భగవంతుణ్ణి స్మరించుకుంది. అమ్మా-నాన్న, భర్త-పిల్లలూ అందరూ కళ్ళ ముందు మెదలసాగారు. ఒక్కసారి వాళ్ళందర్ని క్షమాపణ కోరాలి.

ఎట్లాగూ తను బ్రతకదు. అది తనకూ - డాక్టరుకీ రూఢిగా తెల్సు. పోయే ముందు తన దేశానికి వెళ్ళాలి! అవును వెళ్ళాలి.

ఆమె కళ్ళు సజలాలయ్యాయి.